www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 24 నవంబర్ 2025

పది పరీక్షలపై సందేహాలకు గ్రీవెన్స్ సెల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

టెన్త్ క్లాస్ పరీక్షలకు సంబంధించి జిల్లాస్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్టు డిఇఒ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల నామినల్ రోల్స్‌లో తప్పులు లేకుండా పరిశీలించి సంబంధిత పాఠశాల యు డైస్‌లో వెరిఫై చేసి, పరీక్షల ఫీజు చెల్లించి సబ్మిట్ చేయాలన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు కార్యాలయ పని వేళల్లో ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునని తెలిపారు. ఎం.అమలకుమారి అసిస్టెంట్ కమిషనర్ 9849939487, ఎవి.ఉమామహేశ్వరరావు, సూపరింటెండెంట్ 9848597115, ఎన్.సత్తిబాబు, ఎఎస్ఒ 8985491066, టి.నాగిరెడ్డి. డిఎస్ఒ 9493650136, బి.రాజ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ 9849459869ను సంప్రదించాలని సూచించారు.

స్థానిక పోరుకు సమాయత్తం

- 3 నెలల ముందు ప్రచారానికి తెర
- మార్పులు, చేర్పులకు అస్త్రంగా 'సర్'

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పల్లెపోరుకు అధికార యంత్రాంగం సమాయత్తం అవుతుందా అంటే ఔననే సమాధానం వినిపిస్తోంది. సమగ్ర పారదర్శక ఓటర్ల జాబితా రూపొందించాలన్న కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జిల్లాలో ప్రారంభం అయింది. దీనిలో భాగంగా అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారుల ద్వారా జాబితాల పరిశీలన ప్రారంభమైంది. బోగస్ ఓటర్లను గుర్తించేందుకు 2002, 2025 జాబితాలను సరిపోల్చుతూ ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి ధ్రువీకరిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఓటర్ల జాబితాను మరోసారి ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. గతంలో ఎన్నికల కమిషన్ గడువుకు మూడు నెలల ముందే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామన్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన విషయం విదితమే. అయితే ఇప్పటివరకు ఎలాంటి సమీక్షలు, వీడియో, ఆడియో కాన్ఫరెన్సులను ఎన్నికల సంఘ అధికారులు నిర్వహించకపోవడం, ఎన్నికల సిబ్బందికి అవసరమైన శిక్షణ కోసం కసరత్తు ప్రారంభించకపోవడం చూస్తుంటే ఎన్నికలు ముందుగా కాకుండా నిర్ణీత గడువుకే జరిగేలా వున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు.

3 నెలల ముందు ప్రచారానికి తెర

అక్టోబరు 15లోగా వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలి. అప్పటినుంచి నవంబరు 15లోగా వార్డుల వారీగా ఓటర్ల జాబితా సిద్ధం చేసి ప్రచురించాలి. ఎన్నికల అధికారుల నియామకం పూర్తి చేయాలి. అప్పటి నుంచి నవంబరు 30లోగా పోలింగ్ కేంద్రాలను ఖరారు చేయాలి. ఇవిఎంలు సిద్ధం చేయాలి. డిసెంబరు 15లోగా రిజర్వేషన్లు ఖరారు చేయాలి. డిసెంబరు చివరి వారంలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలి. 2026 జనవరిలో ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి అదే నెలలో ఫలితాలు కూడా ప్రకటించాలి. 2026 ఏప్రిల్‌లో పంచాయతీలకు, మార్చిలో నగర, పురపాలక సంస్థలకు ప్రస్తుత పదవీ కాలాలు ముగియనున్నాయి. మూడు నెలలకు ముందే, అంటే వచ్చే ఏడాది జనవరిలోనే ఎన్నికల్ని నిర్వహించాలని ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని సెప్టెంబరు 3న ఆదేశించారు. దీంతో జిల్లాలోని కూటమి పార్టీల నాయకుల్లో స్థానిక సంస్థల పదవులపై ఆశలు చిగురించాయి.

ఇప్పటికీ ఆ దిశగా అడుగులు పడకపోవడంతో 3 నెలల ముందు అనే ప్రకటనకు తెర పడినట్లయ్యింది. మరో వైపు తాజాగా ఈ నేపథ్యంలో ముందస్తుగా ఎన్నికలు జరిగితే స్థానిక సంస్థలపై వైసిపి పెత్తనాన్ని తీసేయొచ్చని కూటమి పార్టీల నాయకులు ఆశపడ్డారు. ఇసి ప్రకటనపై యంత్రాంగంలో చడీ చప్పుడు లేకపోవడంతో నిర్ణీత గడువుకే ఎన్నికలు జరుగుతాయన్న అంచనాకు వచ్చారు.

జిల్లాలోని ఓటర్ల వివరాలు		
నియోజకవర్గం	2002	2025
రాజమహేంద్రవరం అర్బన్	1,46,434	2,66,159
రాజమహేంద్రవరం రూరల్	1,46,434	2,73,520
అనపర్తి	1,79,848	2,26,535
రాజానగరం	1,64,834	2,16,600
కొవ్వూరు	1,63,754	1,84,324
నిడదవోలు	1,84,812	2,13,281
గోపాలపురం	1,78,868	2,43,110
మొత్తం ఓటర్లు	1,64,984	16,23,529

ఆశావహుల ఎదురు చూపులు

జిల్లాలో సుమారు 299 పంచాయతీలు, ఒక కార్పొరేషన్, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ స్థానిక ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డు సభ్యులుగా, కార్పొరేటర్లుగా, కౌన్సిలర్లుగా, మేయర్, డిప్యూటీ మేయర్లుగా, మున్సిపల్ ఛైర్మన్లుగా, వైస్ ఛైర్మన్లుగా పదవులు దక్కుతాయని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లలో మార్పులో చేర్పుల కోసం ప్రజా ప్రతినిధుల ఇళ్ల చుట్టూ క్యూ కడుతున్నారు. 2021లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి 90 శాతానికి పైగా పదవులను చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. కొన్ని స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఈ గెలుపుపై ప్రతిపక్ష పార్టీలు భిన్నాభిప్రాయం వ్యక్తం చేశాయి. దొంగ ఓట్లు హల్‌చల్ చేయడంతో పాటు పెద్దఎత్తున డబ్బులు పంపిణీ చేసి, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి ఎన్నికల అ ర్థా న్నే మార్చి వేశారనే విమర్శలను గత ప్రభుత్వం మూట గట్టుకుంది.

మార్పులు, చేర్పులకు అస్త్రంగా 'సర్'

కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని బిఎల్ఒలు ఇంటింటికీ తిరిగి వెరిఫికేషన్ చేపడుతున్నారు. బీహార్ ఎన్నికల ఫలితాలను ఈ విధానం తలకిందులు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం తీరుపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. అయినా తాజా ఎన్నికలకు ఈ విధానం అమలు చేయడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 2002 జాబితా ప్రకారం 11,64,984 మంది ఓటర్లు ఉన్నారు. 2025 జాబితా ప్రకారం ప్రస్తుత నెల వరకు 16,23,529 మంది ఉన్నారు. అంటే జిల్లాలో 4,58,545 మంది ఓటర్లు పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఓటర్ల జాబితా సమగ్రత, కచ్చితత్వం, స్వచ్ఛీకరణ పేరుతో ఎన్నికల కమిషన్ సర్ పేరుతో సర్వే చేపట్టింది.

ఘనంగా చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

చెకుముకి పోటీల్లో విజేతలతో జెవివి నాయకులు

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన జిల్లాస్థాయి సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రైవేట్ పాఠశాలల విభాగంలో రాజానగరం మండలం శ్రీప్రకాష్ విద్యానికేతన్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో సీతానగరం మండలం రఘుదేవపురం పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజేతలుగా నిలిచాయి. ప్రథమ స్థానం శ్రీప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు పి.భానుప్రతాప్, సాయి సంపత్, ఎ.సాయి ప్రణీత్, ద్వితీయ బహుమతి స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొవ్వూరు మండలం విద్యార్థులు కెవిపి.సత్యనారాయణ, సిహెచ్.అన్నవరం, కె.కూచితా రాణి సాధించారు. తృతీయ బహుమతి శ్రీగౌతమి గాంధీపురం స్కూల్ రాజమహేంద్రవరం విద్యార్థులు కన్సోలేషన్ బహుమతి సాధించారు. ఈ కార్యక్రమంలో జెవివి మెజీషియన్ సిహెచ్.శ్రీరాములు మ్యాజిక్ ప్రదర్శన విద్యార్థులను అలరించింది. సైన్స్ రిసోర్స్ పర్సన్ బివిఎల్ఎన్.ఆనంద్ బాబు ఖగోళ అంశాలను విద్యార్థులకు వివరించారు. విజయం సాధించిన విద్యార్థులకు జెవివి జిల్లా అధ్యక్షుడు కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్.రవిబాబు, గౌరవాధ్యక్షుడు వై.పైడియ్య ఎం.మల్లికార్జునరావు, కోశాధికారి జి.తాతారావు, కార్యదర్శులు వసంతరావు, చిలుకూరి శ్రీనివాసరావు, జిల్లా సైన్స్ అధికారి జివి.నెహ్రూ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.నిశ్చల్, బి.గోపాల్, డి.జార్జిప్రసాద్ పాల్గొన్నారు.

అందరూ సేవా గుణం అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

సత్య సాయి శత జయంతిలో పాల్గొన్న కమిషనర్ రాహుల్ మీనా

సత్యసాయి బాబా సేవాతత్వాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు నగరపాలక సంస్థ కార్యాలయంలోని పిజిఆర్ఎస్ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సాయిబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. సత్యసాయి కీర్తిని కొనియాడారు. ప్రజల కోసం సత్యసాయి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. తాగునీరు, విద్య, వైద్యం వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారన్నారు. తోటి వారికి అందించే సాయం ఎంతో సంతృప్తిని ఇస్తుందనడానికి బాబా జీవితమే చక్కని ఉదాహరణ అన్నారు. అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ మాట్లాడుతూ 130కి పైగా దేశాల్లో నేడు సత్యసాయి సేవలు విస్తరించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జి.శైలజవల్లి, డిప్యూటీ డైరక్టర్ రామారావు, రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు, ఇఇ మదర్సా అలీ, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సిసి 77వ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు.కళాశాల ఎన్‌సిసి కేడెట్లు రక్తదాన కార్యక్రమంలో పాల్గొని సామాజిక సేవ పట్ల తమ నిబద్ధతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ బాషా షేక్ మాట్లాడారు. ఎన్‌సిసి ప్రాధాన్యతను వివరించారు. క్రమశిక్షణ, నాయకత్వం, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను విద్యార్థుల్లో పెంపొందించడం ఎన్‌సిసి ప్రధాన లక్ష్యమని చెప్పారు. రక్తదానం వంటి సేవా కార్యక్రమాలు కేడెట్ల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు, ఎన్‌సిసి కేడెట్లకు అభినందనలు తెలిపారు. అనంతరం ఈగిల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నిర్వహించిన సైకిల్ ర్యాలీలో ఎన్‌సిసి కేడెట్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీరామ్మూర్తి, గర్ల్స్ వింగ్ అధికారి కె.అనూష, జి.సురేష్ పాల్గొన్నారు.

రెండు రోజులు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి-పెరవలి

పెరవలి సబ్ స్టేషన్ పరిధిలో ఆర్‌డిఎస్ఎస్ పనుల కారణంగా సోమవారం, మంగళవారం వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ వ్యవసాయ విద్యుత్, ఉదయం 4 గంటల నుండి ఉదయం 9 గంటల వరకూ, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

కార్టూ'నిజం'



60వ సారి...

ఇండియా-పాక్ యుద్ధాన్ని తానే ఆపానన్న ట్రంప్

ప్రభుత్వాసుపత్రికి వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి - సీతానగరం

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి యువ నాయకులు పెందుర్తి అభిరామ్ స్థానిక ప్రభుత్వాసుపత్రికి సేవా సమితి సమకూర్చిన వీల్ చైర్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ చైతన్య, ఆసుపత్రి సిబ్బంది, సత్యసాయి సేవా సమితి సభ్యులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రి పర్యటనా ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-నల్లజర్ల

ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ గోపాలపురం నియోజకవర్గం ఐఎస్.జగన్నాథపురం సోమవారం పర్యటన నేపథ్యంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి కోరారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అక్కడి ఏర్పాట్లను ఆయన పలువురు నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంట్రపాటి రాజు, కవులూరు సత్తిబాబు, గుడిసె శివకృష్ణ, పెనుమాక కిషోర్ బాబు, కఠారి సాయితేజ, రుద్రా శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల అందజేత

ప్రజాశక్తి -దేవరపల్లి

హెల్పింగ్ హాండ్స్ సొసైటీ, జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కృష్ణంపాలెంలో మహిళలకు అందించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ఆదివారం ముగిసింది. ట్రైనర్ దుర్గాభవాని మార్గదర్శకత్వంలో 45 రోజులపాటు 60 మందికి శిక్షణ అందించారు. శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లను దుర్గాప్రసాద్ అందజేశారు. ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు అందించారు. మహిళల సాధికారత కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు సొసైటీ ప్రెసిడెంట్ కావలిపురపు బాలకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ తిరుపతి ప్రసాద్, సభ్యులు మెంత మురళీకృష్ణ, కోరం ఆంజనేయులు, రొక్కం శ్రీను, పెద్దిరాజు, గమ్య, తనుజ, గ్రేసీ, శివకుమారి, ట్రైనర్ దుర్గాభవాని, వెంకన్న, ఖండవల్లి శిరీష పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందిస్తున్న పూర్వ విద్యార్థులు

గాయపడ్డ విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తాళ్లపూడి

ఇటీవల గాయపడిన వేగేశ్వరపురం స్కూల్ విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆర్థిక సాయం అందించారు. బల్లిపాడుకు చెందిన మేలిమి పోశమ్మ, గండి శ్రీలక్ష్మి, బోడపాటి ధరణికి ఒక్కొక్క విద్యార్థికీ రూ.10 వేల ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందించారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి పరస రాధాకృష్ణ, అర్చక సిద్ధి స్కూల్ ప్రిన్సిపల్ అడ్డాల డేవిడ్ రాజు, లెక్చరర్ మారిశెట్టి సత్యనారాయణ, శీర్ల ప్రసాద్ పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు

హాస్టల్స్‌లోని విద్యార్థులకు ఆదివారం పలుచోట్ల ఆరోగ్య సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉండ్రాజవరంలో వైద్య పరీక్షలు అందిస్తున్న సిబ్బంది

పెరవలి మండలం కానూరులో ఎస్‌సి హాస్టల్‌లో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కె.హేమరాజు విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి తగిన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎంఒ ఎ.రాజమోహన్, సూపర్‌వైజర్ కెవి.నాగేశ్వరరావు, హాస్టల్ వార్డెన్ యు.వినోదరావు, ఎఎన్ఎం టి.రాజేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పి హెచ్.లూధియారాణి, జి.దుర్గా ప్రసాద్, ఎన్.పార్వతి, కె.నాగరాణి, యాతం. లక్ష్మి, కె.ద్వారక పాల్గొన్నారు.

ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వరరావు ఎస్‌సి హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.

గోకవరం కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ తిరన్, డాక్టర్ నిఖిత ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్టల్స్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్స్ సూర్యం, రామకృష్ణ, శంభుడు, వైద్య సిబ్బంది పవన్, విశ్వనాథం, మౌనిక, అనూష, బాపనమ్మ పాల్గొన్నారు.

మెయిన్స్‌లో అర్హులకు పోస్టింగ్ ఇవ్వాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గత వైసిపి ప్రభుత్వంలో మెయిన్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వంతల రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం శ్యామలా సెంటర్ వద్ద ఉన్న ప్రజా సంఘాల కార్యాలయంలో రాంబాబు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఆరు వేల కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చిందని, 2023లో ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించిందని చెప్పారు. అందులో 95 వేల మంది అర్హత సాధించారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం కోర్టు తీర్పులు, నిర్లక్ష్యం కారణంగా ఆ పోస్టులు భర్తీ చేయలేదనఆనరు. తరువాత అధికారంలోకి వచ్చిన కూటమి ఎన్నికల ముందు ఆ పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, నేటికీ ఎన్నికల హామీలు నెరవేర్చలేదని విమర్శించారు. డివైఎఫ్ఐ పోరాటాల ఫలితంగా జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించి జూన్‌లో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించిందని అందులో అర్హత సాధించిన వారికి ట్రైనింగ్ ఇచ్చి పోస్టింగ్ ఇవ్వాలని రాంబాబు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు డి.అశోక్, టి.రాజేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి 'రైతన్నా మీకోసం'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రైతన్నా మీకోసం కార్యక్రమం సోమవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. ప్రతి గ్రామంలోని రైతు కుటుంబాలను వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక శాఖ, పట్టు పరిశ్రమ, మత్స్య శాఖ సిబ్బంది, గ్రామ రెవెన్యూ అధికారి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్ బృందం సందర్శించి ముఖ్యమంత్రి సందేశం గల కల కరపత్రాన్ని అందజేయనున్నట్టు తెలిపారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, సాగులో టెక్నాలజీ వాడకం, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ విధానాల గురించి ప్రభుత్వం నుంచి రైతుకు వస్తున్న మద్దతు సంబంధిత విషయాల గురించి చర్చిస్తారని తెలిపారు.

లేబర్ కోడ్లు అమలు నిలిపి వేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

లేబర్ కోడ్లు అమలుతో బిజెపికి పోయేకాలం దగ్గర పడిందని సిఐటియు జిల్లా నాయకులు కొక్కిరిపాటి వెంకట్రావు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం దూబచర్లలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగ, కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను కోవిడ్ సమయంలో తయారు చేసిందన్నారు. దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మికుల నిరసనల ఫలితంగా నేటివరకూ అమలు చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి లొంగదీసుకుని ఈ కోడ్లు అమలు చేయాలని ఒత్తిడి చేస్తోందన్నారు. ఇప్పటికే పరిశ్రమల్లో కనీస వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ, 8 గంటల పనిదినం, గ్రాడ్యూటీ వంటి సదుపాయాలు సక్రమంగా అమలు చేయడం లేదని, వాటిమీద ప్రభుత్వ అజమాయిషీ లేదన్నారు. ఇప్పుడు లేబర్ కోడ్లు అమలు చేయడం ద్వారా పూర్తిగా కార్మికవర్గాన్ని నట్టేట ముంచే కుట్ర జరుగుతోందన్నారు. తక్షణమే లేబర్ కోడ్లు అమలు ఆపకపోతే మరో దేశవ్యాప్త ఉద్యమం తప్పదని వెంకట్రావు హెచ్చరించారు.

కాలం చెల్లిన మందులు ఇవ్వడం లేదు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం జిజిహెచ్‌లో కాలం చెల్లిన మందులు ఇవ్వడం లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం హాస్పటల్ ఆవరణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు వాస్తవం కాదని, దానిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నామని తెలిపారు. అవాస్తవ కథనాలు ప్రచారం చేసిన సోషల్ మీడియా సంస్థను, ఆ ప్రతినిధిని సంప్రదించడానిక ప్రయత్నించామని, ఇప్పటి వరకూ ఆచూకీ తెలియలేదన్నారు. దీనిపై విచారణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు.

ఎన్‌సిసి డే సందర్భంగా ఐక్యతా రన్

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని అలవరిచేందుకు ఎన్‌సిసి దోహదం చేస్తుందని ఎంఇఒ సిహెచ్.సక్సేనా రాజు విద్యార్థులను అభినందించారు. ఆదివారం ఎన్‌సిసి డేను పురస్కరించుకుని ఉండ్రాజవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఐక్యతా రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, ఐక్యత, క్రమశిక్షణ, సమాజ సేవా భావాలను ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం అని హెచ్ఎం పి.రామకృష్ణ అన్నారు. విద్యార్థుల్లో నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సంధ్యారాణి, సిహెచ్.దుర్గాప్రసాద్, సీతా మహాలక్ష్మి, అరుణ, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు చాగల్లు విద్యార్థులు

ప్రజాశక్తి-చాగల్లు

హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని పీడీలు జె.విజయలక్ష్మి, పోసిరత్నం తెలిపారు. ఈ పోటీలు ప్రకాశం జిల్లా సింగరాయకొండలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకూ నిర్వహిస్తారని తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వాలని పాఠశాల హెచ్ఎం వి.వాసవి తెలిపారు. విద్యార్థులను గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సత్య సాయి తాగునీరు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-గోకవరం

మండలంలో సుమారు నెలరోజుల నుండి సత్య సాయి తాగునీటి సరఫరా నిలిచిపోయిందని, తక్షణమే తాగునీరు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదివారం వివిధ పార్టీల నాయకులు తహశీల్దారు రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్య సాయి రక్షిత తాగునీ పథకం ద్వారా గోదావరి జలాలు మండలంలోని పలు గ్రామాలకు సరఫరా అవుతున్నాయని తెలిపారు. నెల రోజుల నుంచి ఈ నీటి సరఫరా నిలిచిపోయిందని, ఆ సంస్థలో పని చేసే సిబ్బందిని అడిగితే నీటిని శుద్ధి చేసే స్ఫటిక కొరత వల్ల మంచినీటి సరఫరా ఆగిపోయిందని తెలిపాన్నారు. కావున ఈ సమస్యపై ఉన్నతాధికారులు స్పందించి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు ఇనకోటి బాపన్న దొర, సుంకర వీరబాబు, పులపర్తి బుజ్జి, సత్తి వెంకటరెడ్డి, ఉంగరాల ఆది విష్ణు, ముప్పిడి నాగేశ్వరరావు, మామిడి సత్యనారాయణ, గన్‌రెడ్డి సన్యాసిరావు పాల్గొన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం, వేలివెన్నులో ఫణితిని పార్వతి ఆర్థిక సాయంతో వృద్ధులు, అనాథలు, వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలి నుంచి రక్షణ పొందేందుకు వారికి స్థానిక సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుమారు వందమందికి పైబడి పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కఠారి సిద్ధార్థ రాజు, వెలిచేటి బోసు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

సముద్రంలో యువకుని గల్లంతు

ప్రజాశక్తి - సఖినేటిపల్లి

క్రికెట్ ఆడటానికి ఆదివారం సముద్ర తీరానికి స్నేహితులతో కలసి వెళ్లిన ఒక యువకుడు సముద్రంలో స్నానానికి వెళ్లి గల్లంతయ్యాడు. సఖినేటిపల్లి మండలంలో మోరి గ్రామంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇవి.. మోరి గ్రామానికి చెందిన తెన్నేటి మహిమ రాజు(బబ్లు)(14) మలికిపురం మండలం చింతలమోరి బీచ్‌కు తన మిగిలిన ముగ్గురు స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడేందుకు వెళ్లాడు. అయితే క్రికెట్ ఆడేందుకు నలుగురు మాత్రమే ఉన్నారు. దీంతో క్రికెట్ ఆడేందుకు సరిపడిన మంది లేకపోవడంతో వారు సముద్ర స్నానానికి వెళ్లారు. వీరిలో మహిమాజు గల్లంతయ్యాడు. మిగిలిని యువకులు మహిమరాజుకుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. యువకుడి కుటుంబసభ్యులు మలికి పురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. గల్లంతైన మహిమ రాజు 9వ తరగతి చదువుతున్నాడు. ఇతని తండ్రి స్థానికంగా చికెన్ షాపులో పనిచేస్తాడు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - కె.గంగవరం

కె.గంగవరం మండలంలోని అద్దంపల్లిలో యువతి అదృశ్యంపై ఆమె తండ్రి పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. గ్రామానికి చెందిన రామేశ్వరపు త్రివేణి ఈనెల 21న రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి రెండు రోజులు పాటు వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె తండ్రి జానకిరామయ్య కె.గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ లభిస్తే పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట, గొల్లప్రోలు

.జగ్గంపేట జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరోక వ్యక్తి గాయాలపాలయ్యాడు. మండలంలోని మర్రిపాక గ్రామానికి చెందిన కాపావరపు నూకపతి (56) స్కూటీపై జగ్గంపేట వెళుతుండగా అదే వైపు వెళ్తున్న కిర్లంపూడి మండలం గేద్దనాపల్లికి చెందిన వ్యక్తి బైక్‌పై వెళ్తూ ఢీకొట్టాడు. దీంతో నూకపతి తలకు బలమైన గాయమై అపస్మారక స్థితికి చేరుకోగా, ఢీకొట్టిన వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. తలకు గాయమైన వ్యక్తిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గండేపల్లి మండలం జెడ్. రాగంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఎస్ఐ రఘునాథరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే గొల్లప్రోలు శివారు జాతీయ రహదారిలోని వై జంక్షన్ వద్ద ఎపిఎస్ఆర్‌టిసి బస్సు రోడ్డు దాటుతుండగా మోటార్ సైకిల్‌పై కత్తిపూడి నుంచి పిఠాపురం వెళుతున్న ద్విచక్రవాహనదారుడు ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఉండ్రు కృష్ణారావు(40) అక్కడికక్కడే మృతి చెందాడు. మోటార్ సైకిల్‌పై వెనక కూర్చున్న గంధం శ్రీను గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మతుడు పిఠాపురం మండలం నర్సింగపురానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు

ప్రజాశక్తి - జగ్గంపేట

డ్రంక్ అండ్ డ్రైవ్ చేస్తున్న పలువురిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం జగ్గంపేట శివారు గోకవరం వెళ్లే రోడ్డులో ఎస్ఐ రఘునాథరావు తన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన, మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.అలాగే ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను వినియోగించాలని సూచించారు. వెనక కూర్చున్న వ్యక్తులు సైతం హెల్మెట్‌ను వాడాలన్నారు.

బైకును కారు ఢీకొని ఒకరి మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామలకు చెందిన కౌరు సత్యనారాయణ, బాలం గోవింద్ రవళి స్పిన్నింగ్ మిల్ వద్ద బైకుపై వెళుతుండగా కారు వెనకవైపు నుంచి ఢీకొట్టింది. ఇద్దరూ ప్రమాదంలో గాయపడ్డారు. వీరిని తణుకు ప్రభుత్వాసుపత్రి తరలిస్తుండగా కౌరు సత్యనారాయణ(38) మృతి చెందాడు, గోవిందును తణుకులోని నిమ్మగడ్డ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

ఆటోను ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - చాగల్లు

ఆటోను బైకును ఢీకొని ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. చాగల్లు గ్రామ శివారు కుమార్ దాబా వద్ద ఆదివారం ఉకాటకోటేశ్వరం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యులతో బైకుపై వెళుతుండగా ఆటోను ఢీకొన్నాడు. బైకు నడుపుతున్న వ్యక్తికి కాలు విరిగింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వారు గాయాలైన వారిని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రి తరలించాలని తెలిపారు.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - గోకవరం

గోకవరం శివారు గంగాలమ్మ ఆలయంలోని అమ్మవారి వెండి నగలు చోరీ, కొత్తపల్లి శివాలయంలో చోరీకి పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు గోకవరం ఎస్ఐ వి.ఎన్.వి.పవన్‌కుమార్ తెలిపారు. అల్లూరి జిల్లా ఎటపాకకు చెందిన పేరాల నరసింహారావు, గుండి జగదీష్‌ను అదుపులోనికి తీసుకుని వారివద్ద నుంచి 12 గ్రాముల బంగారం, శతమానాలు, కేజీ వెండి వస్తువులు, ఒక ఆటో, బైకు, రూ.2 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరు గోకవరంతో పాటు రాజమహేంద్రవరం, రాజానగరం, రంపచోడవరంలో పలు నేరాలు చేసినట్లు వెల్లడించారు.

స్త్రీ, శిశు సంక్షేమానికి కృషి

ప్రజాశక్తితో ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చెరుకూరి లక్ష్మి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలో స్త్రీ,శిశు సంక్షేమానికి ప్రత్యేక కృషి జరుపుతున్నామని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు మెరుగైన పౌష్టికాహారం అందించి, వారిని ఆరోగ్యంగా ఉంచాలన్నదే ప్రభుత్వ ఆశయమని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ చెరుకూరి లక్ష్మి అన్నారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లు, పాలు వంటి పౌష్టికాహారాన్ని చిన్నారులకు అందిస్తున్నామన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు విషయాలను వెల్లడించారు.

మీ ఉద్యోగ ప్రస్థానం వివరించండి..?

2008కి ముందు వివిధ శాఖల్లో పని చేసిన అనుభవం ఉంది. ఆ తర్వాత 2008లో సిడిపిఒగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్త పేటలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో తిరిగి ఉద్యోగ ప్రస్తానం ప్రారంభించాను. అక్కడ సిడిపిఒగా 6 నెలలు పని చేసిన తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్ ప్రధాన కార్యాలయంలో సిడిపిఒగా పని చేశాను. అక్కడి నుంచి తూర్పుగోదావరి జిల్లా రంగంపేటకు బదిలీపై 2015 జూన్‌లో రాగా అక్కడ 6 సంవత్సరాలు విధులు నిర్వర్తించాను. అక్కడి నుంచి ఏజెన్సీ ప్రాంతం కె.గంగవరంలో 3 సంవత్సరాలు పని చేసి గతేడాది రాజానగరం బదిలీ అయ్యి తూర్పు గోదావరి జిల్లా పీడీగా 2 నెలలు పని చేసి మూడు నెలల క్రితం కాకినాడ జిల్లా పీడీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

జిల్లాలో ఎన్ని కేంద్రాలున్నాయి.?

కాకినాడ జిల్లాలో 10 ప్రాజెక్టుల పరిధిలో 1986 మెయిన్, మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లోనూ 1.38 లక్షల మంది పిల్లలు, 11,518 మంది బాలింతలు, 13,134 మంది గర్భిణులు ఉన్నారు. సుమారు 3,500 మంది టీచర్లు, వర్కర్లు పని చేస్తున్నారు. ఈ కేంద్రాల పరిధిలో ఉన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు బియ్యం, కందిపప్పు, ఆయిల్, చోడి పిండి, ఖర్జూరం, అటుకులు, బెల్లం, వేరుశెనగ చిక్కీలను ప్రభుత్వం పౌష్టికాహారంగా అందజేస్తుంది. పిల్లలకు బాల సంజీవని కిట్లు, గుడ్లు, పాలు సరఫరా అవుతున్నాయి.

అందిస్తున్న సేవలు ఏమిటి.?

గర్భిణులు, బాలింతలకు బాల సంజీవని పేరుతో ఎండు ఖర్జూరం, వేరుశనగ అచ్చులు, రాగి పిండి, బెల్లం తదితర వస్తువులను పంపిణీ చేస్తున్నాం. కేంద్రంలో నమోదైన ఏడు నెలల నుంచి మూడు సంవత్సరాల లోపు చిన్నారులకు బాలామృతం అందిస్తున్నాం. గర్భిణులకు సీమంతాలు నిర్వహించడం, పిల్లలకు అన్నప్రాసన చేయించడం, పోషణ వేడుకలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసాం. లబ్ధిదారులు, చిన్నారులు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేద్రాలకు వచ్చి పోషకాహారాన్ని తీసుకోవాలి. వారిని చైతన్యం చేయడమే వీటి ముఖ్య లక్ష్యం.

ఖాళీల భర్తీని ఎప్పుడు చేస్తారు.?

కాకినాడ జిల్లాలో ఇంకా 3 అంగన్‌వాడీ పోస్టులు, 57 మంది ఆయాలు, 2 మినీ అంగన్‌వాడీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులను డిసెంబర్ నెలలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తాం.

కేంద్రాల తనిఖీలు ఎలా జరుగుతున్నాయి.?

వారానికి 3 సార్లు అన్ని ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను విస్తృతంగా తనిఖీ చేస్తున్నాం. సమయపాలన పాటించడం లేదని మా దృష్టికి వచ్చిన చోట ఆవగాహన కల్పిస్తున్నాం. నెలనెలా నిర్వహించే సమావేశంలోనూ హెచ్చరిస్తున్నాం. అప్పటికీ మారకపోతే చర్యలకు ఉపక్రమిస్తాం. ఆహారం సమయానికి పెట్టని చోట్లా, నిల్వ ఆహారం పెట్టినట్లు మా దృష్టికి వచ్చినా చర్యలు తీసుకుంటున్నాం.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చేలా చర్యలు.?

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీకి వెళ్లినప్పుడు ఆ కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులను విచారిస్తున్నాం. ఎవరికైనా అందలేదని తెలిస్తే తగిన చర్యలు తీసుకుంటున్నాం. చాలా చోట్ల పౌష్టికాహారాన్ని ఇంటికి ఇవ్వాలని ఆడుగుతున్నారు. ఇది సరైంది కాదు. లబ్ధిదారులు కూడా సహకరించాలి. ఆర్హులందరూ లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం.

చిన్నారుల విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు..?

అంగన్‌వాడీ కేంద్రాల్లో భోజనం మాత్రమే పెడతారన్న భావనలో తల్లిదండ్రులు ఉన్నారు. దీంతో వారు పిల్లలను ఆ సమయానికి పంపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అక్కడ పూర్వ ప్రాథమిక విద్యాబోధన ఉందనే విషయాన్ని వారు గుర్తించేలా మా కార్యకర్తలతో క్షేత్రస్థాయిలో ప్రచారం చేయిస్తున్నాం. దీని ద్వారా పిల్లల హాజరును పెంచడానికి చర్యలు చేపడతాం. ఆట, పాటలతో ఒత్తిడి లేకుండా పాఠాలు చెప్తూ వారిలో శారీరక, మానసిక అభివృద్ధికి వారికి తగిన జ్ఞానాన్ని పెంపొందిస్తున్నాం. ప్రతి కేంద్రంలోనూ బేబీ టాయిలెట్స్‌ను ఆడ, మగ పిల్లలకు వేర్వేరుగా ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

అద్దె కేంద్రాల్లో సౌకర్యాలు ఎలా..?

అద్దె భవనాలకు ఇచ్చే అద్దె కూడా పెరిగింది. అయితే వాటిలో సౌకర్యాలు మెరుగుదలకు చర్యలు తీసుకుంటున్నాం. వాటిలో తప్పకుండా విద్యుత్, నీరు, మరుగుదొడ్ల సదుపాయం ఉండాలి. అవి లేని భవనాలు ఉంటే వాటిని మార్చుకునేలా ఆ కేంద్రాల కార్యకర్తలకు సూచిస్తాం.

గ్రోత్ మానటిరింగ్ కార్యక్రమం కొనసాగుతుందా.?

పిల్లల బరువు, ఎత్తు కొలిచే కార్యక్రమమే గ్రోత్ మానిటరింగ్ అంటారు. ప్రతి నెల అన్ని ప్రాంతాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పిల్లల ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు స్థానిక ఆరోగ్య కార్యకర్తలకు తల్లిదండ్రులకు తెలియజేసి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా నిరసన

ప్రజాశక్తి - జగ్గంపేట

నిరసన వ్యక్తం చేస్తున్న రైతు, కూలీలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ మండలంలోని రామవరంలో రైతు కూలీ సంఘం నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను కాలరాస్తూ లేబర్ కోడ్‌లు అమలు చేయడాన్ని ఖండించారు. ప్రతి సంవత్సరం పెట్టుబడి దారుల సదస్సు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, కార్మికుల సమస్యల ప్రస్తావన చేసే లేబర్ కాన్ఫరెన్స్‌లను మాత్రం 2015 నుంచి నిర్వహించడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేసే ఈ 4 లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాడుగా మరతాయని, కార్మికులు బానిసలుగా మారకముందే ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రంగవల్లి నగర్ నాయకులు డాన్ శీను, సోమరాజు, దేవి, సూరిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సిసి దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఎన్‌సిసి అధికారులను సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్‌సిసి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేజర్ ఎ.త్రిపుల మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది స్వాతంత్ర్యం అనంతరం ఏర్పడిందని, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫామ్ ధరించిన యువజన సంస్థ అని తెలిపారు. రేపటి యువకులను క్రమశిక్షణ, దేశభక్తి గల పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇది స్థాపించబడిందని అన్నారు. ఎన్‌సిసి అధికారి జె.వీరవేణి మాట్లాడారు. అనంతరం అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో త్రిపుల, వీరవేణిలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, పి.ధర్మచంద్రరాజు, రాజా, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

అధ్వానంగా నిడదవోలు-పంగిడి రోడ్డు

ప్రజాశక్తి - చాగల్లు

బురదమయంగా మారిన ప్రధాన రోడ్డు

మండలంలో చాగల్లు మార్టేరు-పక్కిలంక రహదారిలో నిడదవోలు-పంగిడి రహదారి గుంతల మయంగా మారింది. ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు, కొవ్వూరు ఎంఎల్‌ఎలు రహదారి మరమ్మతులకు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పల్ల వెంకన్న నర్సరీలో ఐజి హరికృష్ణ

ప్రజాశక్తి - కడియం

ఐజికి స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం పల్ల వెంకన్న నర్సరీని స్పెషల్ బ్రాంచ్ ఐజి హరికృష్ణ ఆదివారం సందర్శించారు. నర్సరీ రైతులు వెంకటేష్, వినయ్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. కుటుంబ సభ్యులతో కలిసి నర్సరీని సందర్శించిన హరికృష్ణ వివిధ రకాల మొక్కలను పరిశీలించడంతో పాటు వాటి ప్రత్యేకతలను అడిగి తెలుసుకున్నారు. తాను గతంలో తూర్పు గోదావరి జిల్లా ఎస్‌పిగా పని చేసిన సమయంలో నర్సరీ రైతులతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆయన వెంట డిఎస్‌పి రామకృష్ణ, సిఐ ఎ.వెంకటేశ్వర రావు, ఎఎస్ఐ జనార్ధన్ తదితరులు ఉన్నారు.

వాడపల్లిలో అందుబాటులోకి 108 సేవలు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేవిధంగా ఆదివారం 108 వాహనాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో అన్ని వసతులతో నూతన టెక్నాలజీతో ఏర్పాటైన ఈ వాహనాన్ని ఎన్‌టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. దేవస్థానంలో ఇప్పటికే ప్రతి శనివారం ప్రముఖ వైద్యాధికారులతో వైద్య శిబిరం నిర్వహించి ఆలయానికి వచ్చే యాత్రికులకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి శనివారం లక్షకు పైగా వస్తున్న దృష్ట్యా యాత్రికులకు ఏదైనా ఆపద సంభవిస్తే మెరుగైన వైద్యం కోసం 108 వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఆపద సంభవిస్తే అంబులెన్స్ ద్వారా వైద్యానికి తరలించనున్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

అదనపు కట్నం తేవాలంటూ తరచూ భార్యను వేధిస్తున్న భర్తపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ఇవి.. లొల్ల గ్రామానికి చెందిన చాపల సూర్యవేణికి ఆలమూరు మండలం మూలస్థానం గ్రామానికి చెందిన చాపల రవికుమార్‌తో 2013లో వివాహం అయింది. వీరికి సంతానం లేరు. ఇటీవల కాలంలో రవికుమార్ చెడు వ్యసనాలకు బానిసై అదనపు కట్నం తేవాలంటే తరచూ భార్యను వేధిస్తున్నాడు. భర్త వేధింపులు భరించలేక సూర్య వేణి ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి - ఆత్రేయపురం

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇవి.. వెలిచేరు గ్రామానికి చెందిన వానపల్లి హేమ లక్ష్మీ భార్గవికి గతంలో వివాహమైంది. కొద్ది కాలానికి భార్యాభర్తల మధ్య గొడవల రావడంతో వారు విడిపోయారు. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరానికి చెందిన తిమ్మిరి దుర్గాప్రసాద్‌ను హేమలక్ష్మీభార్గవి వివాహం చేసుకునేందుకు ఇరు కుటుంబాల సభ్యులతో పెద్దల సమక్షంలో వివాహం నిశ్చయించుకున్నారు. పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చేసరికి దుర్గాప్రసాద్ నన్ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ ఆదివారం హేమలక్ష్మీ భార్గవి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్ రాము తెలిపారు.

వన సమారాధనలో సందడి చేస్తున్న ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు

ఉత్సాహంగా వన సమారాధన

ప్రజాశక్తి - తాళ్లరేవు

యునైటెడ్ ప్రయివేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వన సమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. మండలంలోని జి.వేమవరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచే కాకుండా చిత్తూరు, ఒంగోలు, తిరుపతి జిల్లాల ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు. ఆయా ఉపాధ్యాయులు ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్ పోటీలలో గెలుపొందిన ఉపాధ్యాయులకు ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన కరీముల్లా, కె.సుధాకర్, చంద్రశేఖర్, గోపాల్‌నాయుడు, గుణశేఖర్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఛైర్మన్ దాసరి శ్రీనివాస్, లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి విజయ్, నాయకులు ప్రగళ్లపాటి కనకరాజు, పూర్ణచంద్రరావు, దున్న జనార్దన రావు, ఈశ్వరరావు, భీమశంకర్, బాలసుబ్రమణ్యం, శ్రీకాంత్, చందు, బాల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి

ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ పరిధిలోని మఱుగుల దిబ్బ సెంటర్‌లోని పురాతన సీతారామాంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొమ్మేటి శ్రీనివాసు పిట్టా జానకిరామారావు, అడబాల కుమారస్వామి, బలుసు వాసు, నిమ్మకాయల కిరణ్, ముత్యం రాజబాబు, పిల్లాడి సత్యవతి, తుమ్మల ప్రసాద్, శెట్టిబత్తుల దుర్గ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

ఎంఎల్ఎ కుమారుని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

మళ్లీ గెలిచేది నేనే...

ప్రజాశక్తి - యానాం

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచేది తానేనని స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక ఫెర్రీ రోడ్లో ఎంఎల్ఎ తనయుడు గొల్లపల్లి గంగాధర ప్రతాప్ రాణా మొదటి పుట్టినరోజు వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన దగ్గరకు వచ్చిన ప్రతి ఒక్కరికి సహాయాన్ని అందించినట్లు తెలిపారు. మత్స్యకారులకు,షెడ్యూల్డ్ కులాల వారికి ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందజేసామన్నారు. రాజకీయాల పరంగా ఎలాంటి నిర్ణయం తీసుకున్న ప్రజాభిప్రాయం తీసుకుంటామన్నారు. తనను నమ్మిన ప్రతి ఒక్కరిని ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం అభిమానుల సమక్షంలో ఎంఎల్ఎ అశోక్ దంపతులు భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపి హరీష్‌మాధుర్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, ఎంఎల్‌సి పేరాబత్తుల రాజశేఖరం, గొల్లపల్లి అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మల్లాడి కృష్ణారావు

పలు కుటుంబాలకు మల్లాడి పరామర్శ

ప్రజాశక్తి - యానాం

ఇటీవల అనారోగ్యాలతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పలు కుటుంబాలను ఆదివారం మల్లాడి కృష్ణారావు పరామర్శించారు. స్థానిక పెద్దిరెడ్డి గార్డెన్‌లో నివాసం ఉంటున్న లంక రమేష్, బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న 10 ఏళ్ల చిన్నారి ఐశ్వర్యను, కీళ్ల వాతవతో బాధపడుతున్న రోజా, ఖండవల్లి కుమారి, రావి జ్యోతి తదితర కుటుంబాలను పరామర్శించారు. యుకెవి.నగర్, భీమ్ నగర్ గ్రామాలలో నెలకున్న డ్రెయినేజీ, రోడ్లు, తాగునీరు సమస్యలను స్థానిక ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

భూమిని పాడు చేస్తున్నారని రైతు ఆవేదన

ప్రజాశక్తి - గోపాలపురం

కాలువ గట్టును తవ్వేస్తున్నారంటూ ఆవేదన చెందుతున్న రైతు

భీమోలు పరిధిలోని చింతలపూడి కాలువకు చెందిన మట్టిని అక్రమంగా తరలిస్తు తన వ్యవసాయ భూమిని, రోడ్లను ధ్వంసం చేస్తున్నారంటూ గ్రామానికి చెందిన రైతు జగ్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు మూడున్నర ఎకరాల జీడి మామిడి తోట ఉందని, తన పొలాన్ని ఆనుకుని చింతలపూడి కాలువ వెళ్లిందని తెలిపారు. దీంతో కొంతమంది మట్టి మాఫియాదారులు రెండు రోజులుగా అక్రమంగా చింతలపూడి కాలువ మట్టిని రాత్రీ పగలూ తవ్వేస్తూ తరలిస్తున్నారని తెలిపారు. మట్టి ట్రాక్టర్లు తన జీడిమామిడి తోటలో నుంచి అక్రమంగా తరలిస్తుండడంతో పూత పూసేందుకు సిద్ధంగా ఉన్న చెట్లు పాడవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోయారు.

త్వరలో దివాన్ చెరువు వంతెన పనులు

ప్రజాశక్తి - రాజానగరం

దివాన్ చెరువు జాతీయ రహదారిపై వంతెన నిర్మాణానికి ప్రత్యేక సర్వే చేపడుతున్నామని ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వంతెన నిర్మాణానికి సమస్యలు లేకుండా సుమారు 80 శాతం వరకూ భూమికి నష్టపరిహారం చెల్లించాలని, ఈ పనులు ప్రారంభించాలని ఆదేశించామన్నారు. రానున్న 2027 పుష్కరాలు రెండు నెలలు ముందు పూర్తి చేయాలని భావిస్తున్నామన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - బిక్కవోలు

బలభద్రపురంలో నిర్మిస్తున్న శ్రీవారాహి మాత ఆలయ నిర్మాణ నిమిత్తం గ్రామానికి చెందిన కర్రి క్రాంతి కుమార్ రెడ్డి రూ.లక్షా 116 విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా కాంతి కుమార్ రెడ్డి మాట్లాడుతూ అలయ నిర్మాణంలో తాము భాగస్వాములు కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT KAKINADA
A.S.No.34 / 2024
Between:
Polisetti Venkata Srinivasa Rao ...Appellant
and
Alapati Ratnaji ...Respondent
To: Respondent:
Alapati Ratnaji, W/o. Nageswara Rao, Hindu, Housewife, age 55 years, D.No. 4-51/3A, Near Uma Manovikasa Kendram, Rayudupalem, Kakinada Rural.
పై నెంబరు అప్పీలులో రెస్పాండెంట్ అయిన మీకు శ్రీ కోర్టువారు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హజరు నిమిత్తం ది.03-12-2025 తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం 10.30 ని॥లకు మీరు పై కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానించబడును.
(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
ఏలూరి సుబ్రహ్మణ్యం
V.S.M.రాజు
అడ్వకేట్స్, డో.నెం.27-5-13, బుద్ధవరపువారి వీధి
కాకినాడ, సెల్: 9848333171

మహారాజశ్రీ అమలాపురం సివిలు జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
E.P.No.5/2011, O.S.No. 82/2007
Between:-
1. కొడవటి సూర్యలక్ష్మి (డైడ్)
2. బోళ్ళ సునీత
3. గారపాటి ఉమాకళ్యాణి
4. పాలచర్ల శాంతి కుమారి ...D.H.R.s
And
1. సత్తి అలివేణి (డైడ్)
2. సత్తి సాయిబాబు (డైడ్)
3. సత్తి శ్రీను ప్రసాద్, 40సం॥లు, తండ్రి.చిన్నయ్య, తొత్తరమూడి, అయినవిల్లి మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
4. కలిగినీడి పద్మావతి, 45సం॥లు,భర్త వెంకన్నబాబు, బోడసకుర్రు, అల్లవరం మండలం, డా॥బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా.
5. సత్తి మీనాక్షి భర్త (లేట్) సాయిబాబు,C/o.తోరం సత్యవతి, డోర్‌నెం.70-16-238, నియర్ ఆంజనేయస్వామి టెంపుల్, న్యూలైఫ్ గెస్ట్‌హౌస్, గొడారిగుంట, కాకినాడ.
6. సత్తి తరుణ్ కుమార్ తండ్రి(లేట్) సాయిబాబు, C/o.తోరం సత్యవతి, డోర్‌నెం.70-16-238, Near ఆంజనేయస్వామి టెంపుల్, న్యూలైఫ్ గెస్ట్‌హౌస్, గొడారిగుంట, కాకినాడ.
7. పోలిశెట్టి విజయాంబిక, భర్త బాబీ, C/o.తోరం సత్యవతి, -do- -do- ...రెస్పాండెంట్లు / JDRs
వేలం ప్రకటన
దావా డిక్రీ బాకీ వసూలు నిమిత్తం రెస్పాండెంట్లు / JDRల సంపూర్ణ స్వాధీన హక్కు భుక్తములలో వున్నటువంటి E.P. షెడ్యూలు స్థిరాస్థి ది.08-12-2025 సం॥రం తేదీని ఉదయం 10.30ని॥ల నుండి పైన తెల్పిన వారి కోర్టులో వేలం వేయబడును. వేలం పాటలో పాల్గొన దలచిన వారు పైన తెల్పిన కోర్టు వారి యెదుట పైన తెల్పిన తేదీని హాజరై D.H.R అడ్వకేట్ వార్ని గాని కోర్టు అమీనా వార్ని గాని సంప్రదించి పాట షరతులు తెలుసుకోవలెను.
షెడ్యూలు
డా॥బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా (పూర్వపు తూర్పుగోదావరిజిల్లా) అయినవిల్లి మండలం, తొత్తరపూడి గ్రామం, గ్రామ పంచాయితీ రి.స.నెం.174/5రు లో పూరా య.1-58ట్లులో య.0-20ట్లు మరియు డోర్‌నెం. 2-126 డాబాయిల్లుకు హద్దులు.
తూర్పు : కుప్పాల శేఖర్ గారి భూమి
దక్షిణం : JDR తాలూకు మిగతా భూమి
పడమర : కొడవటి సుబ్బారావు గారి భూమి
ఉత్తరం : రోడ్డు
యిందలి నానాఫల వృక్షములు, యీజిమెంటు హక్కులతో
D.H.R విలువ : రు.1,50,000/-
అమీనా విలువ : రు.2,60,000/-
నల్లా రవిప్రసాద్
అడ్వకేట్, అమలాపురం
సెల్.9866478976
అమలాపురం
ది.21-11-2025